
ప్రజాశక్తి
మంగళవారం 18 జూన్ 2024



బాధ్యతలు స్వీకరించిన సంధ్యారాణి

ప్రజాశక్తి- సాలూరు

రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సచివాల యంలో మూడో బ్లాక్‌లో ఆమె తొలి సంతకం చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఆమెతో తొలి ఫైల్‌పై సంతకం చేయించారు. కార్యక్రమంలో సంధ్యారాణి భర్త జయకుమార్, కుమారుడు పృథ్వి, తల్లి పార్వతమ్మ, అధికారులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మంత్రి సంధ్యారాణి

కొత్త ప్రభుత్వానికి సమస్యల స్వాగతం

- గాడితప్పిన ఐటిడిఎ పాలన
- కురుపాం నియోజకవర్గాన్ని వెంటాడుతున్న దీర్ఘకాలిక సమస్యలు
- అభివృద్ధికి దూరంగా గిరిజనులు



అభివృద్ధికి నోచుకోని సీమలగూడ మినీ రిజర్వాయర్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కొత్త ప్రభుత్వానికి మన్యం జిల్లాలో సమస్యలు స్వాగతం పలకబోతున్నాయి. కురుపాం నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలున్నా గత ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోకపోవడంతో ఆ సమస్యలు సమస్యగానే మిగిలిపోయింది. దీంతో గిరిజన ప్రాంతం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. కొత్త ఎమ్మెల్యేలు, మంత్రులు రాకతోనైనా మన్యం జిల్లాలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గాడి తప్పిన ఐటిడిఎ

గిరిజనాభివృద్ధి కోసం ఏర్పాటైన ఐటిడిఎ ఐదేళ్లుగా పాలనలో గాడి తప్పింది. మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన పాలకమండల సమావేశాల ప్రస్తావన లేకుండా పోయింది. ఐటిడిఎ స్పెషల్ డిఎస్‌సి ఊసే లేదు. ఆదివాసీ ఆరోగ్య కార్యకర్తలు లేకపోవడంతో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యం గగనమైంది. విద్యార్థుల మరణాలు జరుగుతున్నా నివారణ చర్యలు మాత్రం శూన్యం. ట్రైకార్ రుణాలు గిరిజనులకు అందించి చాలా కాలం అయింది. సబ్సిడీపై వ్యవసాయ రుణాలు, విత్తనాలు, ఎరువుల పంపిణీ కూడా లేవు. సిఆర్‌టిల రెగ్యులరైజేషన్ నియామకంలో లంచాల పర్వంగా కొనసాగింది. అయినా బాధ్యులపై చర్యలు లేవు. స్థానికంగా ఉపాధి లేక గిరిజనులు వలస బాట పడుతున్నారు. గుమ్మ లక్ష్మీపురంలో డైట్ కళాశాల ఏర్పాటుకు చేసిన ప్రతిపాదన నీరుగారింది. ఈ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపై ఉంది.

పరిశ్రమల ప్రస్తావనే లేదు

గత ప్రభుత్వాల హయాంలో మన్యం జిల్లాలో పరిశ్రమల ప్రస్తావనే లేకుండా పోయింది. పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల పరిధిలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సీతంపేట, సాలూరు ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో ఉన్న జీడి, చింత పంటలు, కొండచీపుర్లు, కొండతామర, పసుపు వంటి అటవీ ఫలసాయాలపై గిరిజనులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఐటిడిఎ ద్వారా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తే వలసలు నివారించవచ్చు. చేపల ఉత్పత్తి కేంద్రం, తూనికాకు పరిశ్రమలు ఏర్పాటుతో మరింత ప్రయోజనం ఉంటుంది. గత ప్రభుత్వాలు వీటిపై శ్రద్ధ వహించలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతోనైనా ఉపాధి దొరుకుతుందని మన్యం ప్రాంత వాసులు భావిస్తున్నారు.

అడవి ఏనుగులతో రక్షణ కరువు

మన్యం జిల్లాలో గత కొన్నేళ్లుగా నలుదిక్కుల సంచరిస్తున్న అడవి ఏనుగులతో ప్రజలకు, పంటలకు రక్షణ లేకుండా పోయింది. భామిని, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, కొమరాడ మండలాల్లో సంచరిస్తున్న అడవి ఏనుగుల గుంపును తరలించే చర్యలు చేపట్టడంలో గత ప్రభుత్వాలు, పాలకులు కనీసం శ్రద్ధ వహించలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేలు, మంత్రులు ఏనుగుల తరలింపునకు దృష్టి సారిస్తారని, రక్షణ కల్పిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

నేటికీ సాగు, తాగునీరు కరువే

మన్యం జిల్లాలో ప్రధానంగా గిరిజన ప్రాంతంలో గిరిజనులు దాహార్తి తీర్చుకునేందుకు స్వచ్ఛమైన తాగునీరందడం లేదు. చలమలు, గెడ్డవాగులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. జల జీవన్ మిషన్ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. మరోవైపు పంట పొలాలకు సాగునీరందక ప్రతి ఏటా వర్షాధారంపైనే ఆధారపడి పంటలు పండిస్తున్నారు. గత మూడేళ్లగా కరువు కోరల్లో ఏజెన్సీ చిక్కుకుంది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో మినీ రిజర్వాయర్లు, చెక్ డ్యాములు గత ప్రభుత్వాల నిర్లక్ష్యంగా పడకేశాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతోనైనా ఖరీఫ్ నాటికి సాగునీరందిస్తారని రైతులు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.

కలగానే క్రీడ మైదానాలు

మన్యం జిల్లాలో గుమ్మలక్ష్మీపురం, జియమ్మవలస మండలం రావాడ రామభద్రపురంలో క్రీడా మైదానాల ఏర్పాటు ప్రక్రియ కలగానే మిగిలిపోయింది. ప్రతిపాదనలు తయారుచేసి నిధులు కేటాయించినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. గత 15 ఏళ్లుగా ఈ ప్రక్రియ నిలిచిపోయింది. గుమ్మలక్ష్మీపురంలో ఇండోర్ స్టేడియం పనులు ఐదేళ్లుగా మధ్యలోనే నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతోనైనా క్రీడా మైదానాల పనులు ప్రారంభించి క్రీడాకారుల ప్రోత్సహించాలని కోరుతున్నారు.

వర్షాకాలం వస్తే మరణ మృదంగమే

వర్షాకాలం వచ్చిందంటే చాలు మన్యం జిల్లాలో మరణ మృదంగం వినిపిస్తోంది. ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, గిరిజనులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇదే సమయంలో మెరుగైన వైద్యమందక మృత్యువాత పడుతున్నారు. వివిధ రకాల కారణాలతో ఏడాదిలో కనీసం పది మంది విద్యార్థులు చదువుకొనే ప్రాయంలో మృత్యువుడికి చేరడం తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చింది. మరణాల అదుపునకు గత ప్రభుత్వాలు కనీసం స్పందించలేదు. రానున్న ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించి ఆదివాసీ ఆరోగ్య కార్యకర్తలను నియమించి మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఉంది.

నాన్ షెడ్యూల్డ్ గ్రామాలతో రిజర్వేషన్లు కరువు

జిల్లాలో పలు మండలాల్లోని గిరిజన గ్రామాలు నేటికీ నాన్ షెడ్యూల్ గ్రామాలు గానే ఉన్నాయి. ఇక్కడ నివసిస్తున్న గిరిజనులకు ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు కరువయ్యాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు కూడా అందడం లేదు. దీంతో గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారు. షెడ్యూల్డ్ గ్రామాలుగా గుర్తించాలని గిరిజనులు కోరుతున్నారు.



గుమ్మలక్ష్మీపురంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం



ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ఘనంగా బక్రీద్

ప్రజాశక్తి - కురుపాం


మండల కేంద్రమైన కురుపాంలో గల జామియా మసీదులో బక్రీద్ పండుగను పురస్కరించుకొని సోమవారం ఇమామ్ (మత గురువు) సర్దార్ ఆలం ఖాన్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు మాట్లాడుతూ బక్రీద్ పండుగ అల్లా ఆజ్ఞ మేరకు తన కన్న కొడుకునే త్యాగం చేయడానికి సిద్ధమైన దైవ దూత మహమ్మద్ ప్రవక్త త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండగ జరుపుకుంటారని అన్నారు. త్యాగం, దానం, సోదర భావం, భక్తి ఈ పండగ ముఖ్యోద్దేశ్యమని అన్నారు. నమాజ్ అనంతరం ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ ప్రత్యేక ప్రార్థనలో కురుపాం ముస్లిం సోదరులతో పాటు చినమేరంగి, గుమ్మలక్ష్మీపురం ముస్లిం సోదరులు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్లు నిరోధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో డిప్యూటేషన్లు నిరోధించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి రమేష్, ఎస్ మురళీమోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల గిరిజన సంక్షేమ హైస్కూళ్లలో డిప్యూటేషన్ల పర్వం మొదలైందని అధికారుల వద్దకు ఉపాధ్యాయులు వెళ్లి ఒప్పందం జరుపుకుంటున్న సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఏటా డిప్యూటేషన్లు ప్రోత్సహించమని అధికారులు తెలియజేస్తున్నప్పటికీ అవి అమలు కావడం లేదని డిప్యూటేషన్ వల్ల గిరిజన విద్యార్థులకు న్యాయం చేసేదిగా ఉండాలి తప్ప అన్యాయం చేసేదిగా ఉండకూడదని పేర్కొన్నారు. ఈ డిప్యూటేషన్ల వ్యవహారం కొంతమందికి అక్షయ పాత్రగా మారిందని ఈ విధానానికి స్వస్తి పలికే విధంగా ఐటిడిఒ పిఒ జోక్యం చేసుకొని ఈ ఏడాది యధావిధిగా అక్రమ డిప్యూటేషన్లు వేయకుండా నిలువరించాలని కోరారు. అలా జరగని యెడల యుటిఎఫ్ తరఫున పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ప్రకటనలో తెలిపారు.

ఎంఎంసి మాజీ చైర్మన్ మృతి



ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

వైసిపి సీనియర్ నాయకుడు, ఎంఎంసి మాజీ చైర్మన్ భీమవరపు కృష్ణమూర్తి సోమవారం రాత్రి 7.30గంటలకు మృతి చెందారు. ఆయన పార్థివ దేహాన్ని శ్రీకాకుళం నుండి స్వగ్రామం ములగ గ్రామానికి తీసుకొచ్చారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో పాటు వైసిపి శ్రేణులు కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నారు.

తీరని కరెంట్ కష్టాలు

- పెనుగాలులతో నేలకొరిగిన చెట్లు
- విద్యుత్తు స్తంభాలు పడిపోవడంతో అంతరాయం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో ఈనెల 14న వీచిన పెనుగాలులు, భారీ వర్షానికి అనేక చోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు పడిపోవడం, స్తంభాలు కూలిపోవడంతో ప్రజలు ఇంకా కరెంట్ కష్టాలు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో మొత్తం పది విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కూలిపోయాయి. స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ నుంచి పోస్టాఫీసు జంక్షన్, మెయిన్ రోడ్, డీలక్స్ సెంటర్, దండిగాం రోడ్డు, చిట్లు వీధుల్లో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. గత మూడు రోజులుగా విద్యుత్ సిబ్బంది కూలిపోయిన స్తంభాలు లేపడం, తెగిపోయిన విద్యుత్ వైర్లను అనుసంధానం చేయడం వంటి పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. దీనివల్ల పట్టణంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఉక్కపోతతో నరకయాతన అనుభవించారు. చిరువ్యాపారులు విద్యుత్ సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికీ పట్టణంలో పడిపోయిన చెట్లను మున్సిపల్ సిబ్బంది తొలగించలేదు. చెట్లకు వేలాడి వున్న కొమ్మలను కూడా తొలగించలేదు. దీంతో చెట్లు సమీపంలో ఉన్న ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికీ విద్యుత్ సరఫరా సరిగా వుండడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ ఎప్పుడు వుంటుందో లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి: ఎన్వైనాయుడు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు

పట్టణంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, పెనుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయిన ప్రాంతాలను సిపిఎం బృందం సోమవారం పరిశీలించింది. జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు పట్టణంలో భారీ వర్షాలు, గాలులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాలను పరిశీలించారు. మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో స్థానిక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని చెప్పారు. వెంటనే పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.



చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయిన ప్రాంతాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

సుమారు పది లక్షల నష్టం

పట్టణంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, పెనుగాలులకు విద్యుత్‌శాఖకు సుమారు రూ.10లక్షల మేర నష్టం వాటిల్లిందని ఎపిఇపిడిసిఎల్ డిఇ ఎంవి రంగారావు చెప్పారు. పట్టణంలో పది విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని, కొన్ని చోట్ల విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మలు పడిపోయాయని చెప్పారు. యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పడిపోయిందని చెప్పారు. గత మూడు రోజులుగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు.



పెద్దగూడ వద్ద బోల్తా పడిన వ్యాను

వ్యాన్ బోల్తా ; 16 మందికి గాయాలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గెద్దగూడ సమీపాన అదుపుతప్పి బొలెరా వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 16 మంది గాయాలపాలయ్యారు. పరిస్థితి ఆందోళన కారణంగా ఉన్న 8మందిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. వివరాలకు వెళ్తే...

సీతంపేట మండలం పాండ్ర, కింద్రువాడ నుంచి బొలెరా వ్యాన్‌లో 26మంది గిరిజనులు సోమవారం జరిగిన సీతంపేట సంతకు వస్తున్నారు. గెద్దగూడ సమీపంలో వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో 16 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో సవర తిక్కమి, జెర్రినీయా, భూగన్న, సొంబురు, ఎల్లంగో, గంగారావు, తవుడు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సీతంపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే తోటపల్లి రిజర్వాయర్ మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ, మండల టిడిపి అధ్యక్షులు సవరతోట మొఖలింగం క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

కొట్టుకుపోయిన కాజ్‌వే

నాసిరకం నిర్మాణంతో రూ.94 లక్షలు వృథా

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

మండలంలోని పారాది వద్ద వేగావతి నదిపై నిర్మించిన కాజ్‌వే కొట్టుకుపోయింది. పారాది వంతెన కుంగడంతో రూ.94 లక్షలతో నిర్మించిన కాజ్ వే నిర్మించారు. వరద నీరు పోయేందుకు ఖానాలు ఏర్పాటు చేసినప్పటికి సిమెంట్ కాంక్రీటుతో నిర్మించలేదు. మెటల్‌తో నింపేసి, దానిపై బిటి రోడ్డు నిర్మించారు. సోమవారం వేగావతి నది వరదనీటి ఉధృతికి కాజ్‌వే కొట్టుకుపోయింది. సిమెంట్ కాంక్రీటుతో కాజ్‌వే నిర్మించకపోవడం వల్లే వరద ఉధృతికి కొట్టుకుపోయిందని విమర్శలు వస్తున్నాయి. కాజ్ వే కొట్టుకుపోవడంతో ద్విచక్ర వాహనాలు, కార్లను పాత వంతెన పైనుంచి రాకపోకలకు అనుమతించారు. భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నారు. భారీ వాహనాలను దారి మళ్లించడంతో రవాణా ఖర్చులు భారం కావడంతోపాటు సమయానికి గమ్యానికి చేరుకోలేక పోతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నూతన వంతెన నిర్మాణం చేపట్టి, రాక పోకలకు ఇబ్బం దులు లేకుండా చూడాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



కొట్టుకుపోయిన కాజ్ వే

కాసుల పంటగా


ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు

లక్షల్లో ప్రభుత్వ ఖజానాకు గండి

అక్రమ వసూళ్లతో రెవెన్యూ కార్యాలయానికి సోకులు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని అనధికార లేఅవుట్లు, ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులు వారికి కాసుల పంటగా మారుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన అధిక మొత్తం పలువురు అధికారుల జేబుల్లోకి చేరుతున్నాయనేది బహిరంగ విమర్శ. రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు ప్రకారం ఏదైనా సంస్థ రియల్ ఎస్టేట్ లే అవుట్ వేయాలంటే ముందు గా గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ నుంచి ప్లానింగ్ అప్రూవల్ టౌన్ ప్లానింగ్ శాఖకు తమ లేవుట్‌లో రహదారి, మురుగు కాల్వలు, తాగునీటి, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేసిన వివరాలు అందజేసి వారి క్షేత్ర స్థాయిలో సందర్శన తర్వాత ప్రభుత్వానికి కొలతలు ప్రాప్తికి సూచించిన మొత్తం చెల్లించి అనుమతి పొందాలి. కానీ కురుపాం మేజర్ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెలసిన రియల్ ఎస్టేట్ ద్వారా ఖజానాకు చేరిన మొత్తం అరకొర మాత్రమేనని చెప్పక తప్పదు. అంతేకాకుండా రెవెన్యూ శాఖకు ముందే ల్యాండ్ కన్వర్షన్ అనుమతులు, లేఅవుట్ వేసేందుకు అనుమతి తీసుకోవాలి. కానీ ఫిర్యాదులు అందిన ప్రతిసారీ సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ క్షేత్ర స్థాయిలో తూతూ మంత్రంగా పరిశీలన చేసి నోటీసులు జారీ చేసి రాష్ట్ర ఖజానాకు చేరాల్సిన మొత్తం సొంత జేబుల్లో నింపుకుంటున్నారనే విమర్శలు జోరందుకున్నాయి. ఫలితంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు దగాకోరుతనానికి అడ్డూ ఆపులేకుండా పోయి సామాన్య ప్రజలకు అందని ఎత్తులో స్థలాలు ధరలు చేరుకుని ఆకాశాన్ని అంటుతున్నాయి. ఎలాగూ ఏర్పడిన అనధికార బంధాన్ని ఆసరాగా చేసుకుని రియల్ ఎస్టేట్‌ల్లో ప్రభుత్వ, అసైన్డ్, డి పట్టా భూములను కలుపుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎన్నికల ముందు ఓ ఉన్నతాధికారి ఏకంగా రామదాసు అవతారం ఎత్తి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రహరీగోడ, కార్యాలయం ముందు రేకులు షెడ్, ఆఫీసుకు అవసరమైన ఏర్పాట్లు రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో తలపండిన మాజీ ప్రజాప్రతినిధి ద్వారా నిర్మించేశారు. ఎన్నికలు సమయంలో ఎలాంటి నిధులు లేకుండా జరిగిన నిర్మాణాలకు డబ్బు ఎలా వచ్చింది? చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇలా చేయడం తప్పు అని మందలించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సింది పోయి ఏదో ఒక విధంగా ప్రహరీ నిర్మాణం పూర్తి చేయాలని తర్వాత బాధ్యతలు స్వీకరించిన అధికారిని నోటి ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. అలాగే మిగిలిన పనులు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారి ప్రహరీ గోడను పూర్తి చేసి రంగులు వేసి ఉన్నతాధికారి వద్ద ప్రశంశలు పొందారు. గతంలో పని చేసిన ఓ అధికారి మ్యుటేషన్‌కు ముందుగా డబ్బు భారీగా తీసుకుని పక్క మండలానికి బదిలీపై వెళ్లిపోగా ఎన్నికల సమావేశానికి వచ్చిన సమయంలో సదరు అధికారిని బహిరంగంగా నిలదీసి ద్విచక్ర వాహనం అడ్డుకోరగా యుద్ధ ప్రాతిపదికన పని పూర్తి చేసి పెట్టారు. గతంలో అడపాదడపా రెవెన్యూ కార్యాలయాలపై ఎసిబి సోదాలు నిర్వహించి హెచ్చరించినప్పటికీ బేఖాతరుగా ఉన్న అధికారులు ఈ నూతన ప్రభుత్వంలో తీరు మార్చుకుంటారో ...పాత అక్రమార్జన ధోరణి కొనసాగిస్తారో వేచి చూడాల్సిందే.



రియల్‌ఎస్టేట్ స్థలంలో పంచాయతీ రెవెన్యూ అధికారులు పాతిన హెచ్చరిక బోర్డు (ఫైల్)

రెవెన్యూ సేవలకు ధరలు పట్టిక పాటించాల్సిందే


స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సామాన్యులు రెవెన్యూ సేవలు పొందాలంటే వారు గత ఏడాది ఏర్పాటు చేసిన నూతన ధరల పట్టిక పాటించాల్సిందే. లేకుంటే సేవలు అక్కర్లేదని దూరంగా ఉండిపోవాల్సిందేనన్న బహిరంగ ఆరోపణలు ప్రజలు నుంచి బలంగా వినిపిస్తున్నాయి. మ్యుటేషన్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ల్యాండ్ సర్వే ఇలా ప్రతి దానికి ఓ ధర నిర్ణయించారు. దాన్ని ఫాలో అయితే యువ అధికారి రంగంలోకి దిగి సర్వంతానై రెవెన్యూ కరుణా కటాక్షం చూపిస్తారు. లేదంటే కాళ్లరిగేలా రెవెన్యూ ప్రదక్షిణలు చేయాల్సిందే. కాసుల వర్షం కురిపించే వారికి ఎదురుగా వెళ్లి రెడ్ కార్పెట్ వేసి ఉత్సాహం చూపుతున్న వీరు సామాన్యులను ముప్పుతిప్పలు పెడుతున్న వైనంపై మండి పడుతున్నారు. గతంలో ఎసిబిని సైతం ఆశ్రయించే స్థాయిలో విసిగిపోయారు.

ఖాళీ స్థలాలు కొత్త పరిశ్రమలకు కేటాయింపు

ప్రజాశక్తి-బొబ్బిలి

పరిశ్రమలకు స్థలాలు కేటాయించినప్పటికీ పనులు ప్రారంభం కాని పరిశ్రమల స్థలాలను రద్దు చేసి నూతన పరిశ్రమలకు కేటాయిస్తామని రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. సోమవారం తొలిసారి బొబ్బిలి వచ్చిన మంత్రి శ్రీనివాస్ కు ఎమ్మెల్యే బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మరిశర్ల రామారావునాయుడు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కూటమి నాయకులు, కార్యకర్తలు మంత్రి శ్రీనివాస్ కు పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం దర్బార్ మహాల్లో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో సమస్యలను తెలుసుకునేందుకు పర్యటిస్తున్నామని చెప్పారు. ప్రజలు, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రోత్ సెంటర్లో ఇథనాల్ పరిశ్రమకు భూమి కేటాయించినప్పటికి పరిశ్రమ పనులు ప్రారంభించలేదన్నారు. పనులు ప్రారంభం కానీ పరిశ్రమల స్థలాలను రద్దు చేసి నూతన పరిశ్రమలకు కేటాయిస్తామని చెప్పారు. గ్రోత్ సెంటర్‌లో మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. మూతపడిన చక్కెర పరిశ్రమలను తెరిపించేందు ప్రయత్నం చేస్తామన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



పాచిపెంట మండలంలోని పాంచాలి సర్పంచ్ బూడేపు యుగంధర్ రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణికి పుష్పగుచ్ఛ ఇచ్చి అభినందనలు తెలిపారు. - ప్రజాశక్తి, పాచిపెంట

వసతి గృహాల నిర్వహణపై నిర్లక్ష్యం

● కనీస వసతుల్లేక విద్యార్థుల అవస్థలు ● ఇన్‌ఛార్జి అధికారులతో నెట్టుకొస్తున్న వైనం ● మూసివేత దశలో సంక్షేమ హాస్టళ్లు

ప్రజాశక్తి - వీరఘట్టం/జియ్యమ్మవలస

బడుగు, బలహీనవర్గాల పిల్లలు ఉన్నత చదువులతో పాటు కనీస మౌలిక వసతులు కల్పించేందుకు వీలుగా ప్రభుత్వాలు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వసతి గృహాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాయి. అయితే పాలకుల నిర్లక్ష్యం వల్ల నేడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. దీంతో బడుగు, బలహీన వర్గాల పిల్లలు వసతితో పాటు విద్యకు దూరమయ్యే పరిస్థితి కనిపిస్తుంది. ఇందుకు నిదర్శనం మండల కేంద్రంలోని ఎపి సాంఘిక సంక్షేమం శాఖ బాలుర వసతి గృహం ఉంది.

ఈ వసతి గృహంలో మూడో తరగతి నుండి పదో తరగతి వరకు ప్రవేశాలు పొందాల్సి ఉన్నప్పటికీ 2023-24 విద్యా సంవత్సరానికి 8వ తరగతిలో ముగ్గురు, 9వ తరగతిలో ఇద్దరు, పదో తరగతికి ఐదుగురు విద్యార్థులు మాత్రమే విద్యను కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి చదివిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో ఆ ఐదుగురు విద్యార్థులు వెళ్లిపోవడంతో కేవలం అయిదుగురు విద్యార్థులు మాత్రమే మిగిలిపోయారు. దశాబ్దం కిందట సుమారు రూ.50 లక్షల అంచనా వ్యయంతో ఈ వసతి గృహం నిర్మించారని, అనుకున్న స్థాయిలో విద్యార్థులు లేకపోవడంతో వసతి గృహం కొనసాగుతుందా?



వీరఘట్టం: విద్యార్థులు లేక మూతబడిన వసతి గృహం

మూసి వేస్తారా అంటూ ప్రజల్లో చర్చ సాగుతుంది. ఒకప్పుడు వందల్లో విద్యార్థులు ఉన్న వసతి గృహంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల నేడు మూసివేసే పరిస్థితి వచ్చిందని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఇన్‌ఛార్జి అధికారులతోనే నెట్టికొస్తున్న వైనం

ఈ వసతి గృహానికి రెగ్యులర్ సంక్షేమాధికారిని నియమించారు. దీంతో గరుగుబిల్లి మండలం రావివలస వసతి గృహం సంక్షేమాధికారి పి.ధర్మారావుకు రెండేళ్ల కిందట అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన నిర్వహణ భారం ఎక్కువ కావడంతో ఇక్కడ పూర్తిస్థాయిలో బాధ్యతలు నిర్వహించకపోయారు. దీంతో ఈ వసతి గృహానికి దిక్కు, ముక్కు లేని పరిస్థితి ఏర్పడింది. అప్పట్లో కమాటిగా పోలరావు విధులు నిర్వహించేవారు. కమాటితో పాటు అదనంగా నైట్ వాచ్మెన్ కూడా ఉండేవారు. గత ఏడాది అక్టోబర్‌లో పోలారావు గుండెపోటుతో మృతి చెందడంతో కొద్దిరోజులు వసతి గృహాన్ని మూసివేసి ఇక్కడ చదువుతున్న విద్యార్థులను రావివలస వసతి గృహానికి తరలించారు. కొన్ని రోజుల తర్వాత అక్కడి నుంచి విద్యార్థులను మళ్లీ ఇక్కడికి తరలించారు. అయితే వసతి గృహం నిర్వహణకు సరైన బాధ్యులు లేకపోవడంతో రాత్రి అయ్యేసరికి విద్యార్థుల్లో భయం నెలకొంది. టిడిపి ప్రభుత్వ హయాంలో వసతి గృహాలకు ఇన్వర్టర్ సదుపాయం కల్పించినప్పటికీ కొన్నాళ్లు పనిచేసి మూలకు చేరడంతో విద్యార్థులు చీకట్లోనే ఉంటున్నారు. ఏది ఏమైనా గత ప్రభుత్వం వసతి గృహం నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. గురువారం నుండి పాఠశాలలు పున ప్రారంభం కావడంతో అందులో భాగంగా వసతి గృహాలు ప్రారంభించాలి. కానీ ఇక్కడ చదివిన విద్యార్థులు రాకపోవడంతో ప్రస్తుతం వసతి గృహం మూత పడింది. మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహం కూడా విద్యార్థులు లేక మూతపడడంతో ప్రస్తుతం ఈ భవనాన్ని మండల పరిషత్ కార్యాలయంగా వినియోగిస్తున్నారు. అలాగే నీలానగరంలో కోటి రూపాయలతో నిర్మించిన భవనం కూడా విద్యార్థుల్లేక మూసివేయడంతో ప్రస్తుతం ఆ భవనాన్ని సచివాలయంగా వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో బాలుర సంక్షేమ వసతి గృహంలో కూడా అదే కోవలోకి వెళ్లనుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి వసతి గృహం మూతపడకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బిజెపురం బాలుర వసతి గృహంలో తలుపులు, రన్నింగ్ వాటర్ లేని మరుగుదొడ్లు

పొదలు , డొంకల నడుమ బి.జె.పురం బాలుర వసతి గహం

జియ్యమ్మవలస : మండలంలోని బిజెపురంలో గల బాలుర వసతి గృహంలో కనీస సౌకర్యాల్లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఇక్కడ 6 నుండి 10 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు సుమారుగా 40 మంది వరకు ఉన్నారు. ఒక్క మరుగుదొడ్డుకైనా, స్నానపు గదులకైనా తలుపుల్లేవు. రన్నింగి వాటర్ లేక మరుగుదొడ్లు దుర్వాసన వెదజల్లడంతో విద్యార్థులు బహిర్భూమికి వెళ్లాల్సిన పరిస్థితి. వసతి గృహం చుట్టూ పొదలు, డొంకలు ఏ రాత్రి ఏ పాము, విషపు పురుగులు దాడి చేస్తాయో తెలియని పరిస్థితి. కాంపౌండ్ వాల్ లోపల ఉన్న హెల్త్ సబ్ సెంటర్ ఉన్నా ఏ ఒక్క అధికారీ పట్టించుకునే పరిస్థితి లేదు. ఇదే మార్గంలో మండల కేంద్రానికి వెళ్లే ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా కనీసం ఇటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం దురదృష్టం. లక్షలాది రూపాయలు నిధులతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌గా నిర్మాణం జరిగిన ఈ వసతి గహం అధికారుల ఆదరణకు నోచుకోక, పిల్లలు ఆడుకోవడానికి సరిపడా విశాలమైన స్థలం ఉన్నా పెద్ద పెద్ద పిచ్చి మొక్కలతో పశువులను, గొర్రెలను మేపులా అడవిలా మారింది. అంతేకాదు శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి ఏర్పడిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుతున్న డిఎంఒ జగన్‌మోహన్‌రావు

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

ప్రజాశక్తి - కొమరాడ

సీజనల్ వ్యాదులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహన్ రావు అన్నారు. మండలంలోని చంద్రంపేట, మార్కొండపుట్టి గ్రామాలను సోమవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా సందర్శించి గ్రామాల్లో ఫీవర్ సర్వే, డ్రైడే కార్యక్రమాలు ఏ మేరకు చేపడుతున్నారో పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో దోమల లార్వా వృద్ధి చెందే ప్రదేశాలను సకాలంలో గుర్తించి, నివారణ చర్యలు చేపడుతన్నదీ, లేనిదీ, గ్రామాల్లో జ్వరాలు ఏమైనా ఉన్నాయా తదితర వివరాలపై ఆరా తీశారు. జూన్ 1 నుంచి 30 వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా అక్కడ ప్రజలకు మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాదులపై అవగాహన కల్పించారు. జ్వరాలు ప్రధానంగా దోమల ద్వారా ప్రబలుతాయని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలని ముఖ్యంగా ఉపయోగంలో లేని పడవేసిన తొట్లు, డబ్బాలు, టైర్లు, కొబ్బరి చిప్పలు మొదలగు వాటిలో వర్షపు నీరు చేరి దోమల ఉత్పత్తి జరుగుతాయని వాటిని తొలగించాలని అన్నారు. ప్రతిరోజూ డ్రైడే పాటించాలన్నారు.. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ జయగౌడ్, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ 10వ వార్డు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని టిడిపి మండల అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన నగర పంచాయతీ పదో వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీరు, వీధిలైట్లు, రోడ్లు సమస్యలను గుర్తించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల నగర పంచాయతీ పట్టణ ప్రెసిడెంట్ లెంక అప్పలనాయుడు, వీరభద్రుడు, కౌన్సిలర్ నరవ రామలక్ష్మి, యూత్ ప్రెసిడెంట్ పిల్లా శ్రీనివాసరావు, మీసాల శ్రీనివాసరావు, గంట లక్ష్మణరావు, పైల సురేష్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో విత్తనాలు

ప్రజాశక్తి - గుర్ల

రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రాంమల్లిక్ నాయుడు అన్నారు. సోమవారం ఆయన గుర్ల రైతు భరోసా కేంద్రం వద్ద రాయితీ వరి విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కృత్రిమ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పొట్నూరు ప్రమీల, టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వెన్నె సన్యాసినాయుడు. కార్యనిర్వాహక కార్యదర్శి తిరుముల రాజు కిరణ్ కుమార్, వైస్ ఎంపిపి తోట తిరుపతి రావు, నియోజకవర్గం బిసిసెల్ నాయకులు దాసరి శివ ప్రసాద్, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

డాబా పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వంగర

మండలంలోని అరసాడ స్వీట్ షాపులో పనిచేసిన బేర వెంకటరావు ఆదివారం రాత్రి నిద్రమత్తులో డాబాపై నుంచి కిందకు జారిపడి గాయాలు కావడంతో అతన్ని రాజాంలో గల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి శ్రీకాకుళంలో గల రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వెంకటరావు సోమవారం మృతి చెందాడు. అతని భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వైవి జనార్ధన్ తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని బంగారమ్మపేట గ్రామానికి చెందిన వివాహిత తాడితూరి అనూష (20) అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందింది. ఎస్ఐ యు.మహేష్ కథనం ప్రకారం... బంగారమ్మ పేట గ్రామానికి చెందిన మక్కా జగదీష్‌తో నాలుగు నెలల క్రితం అనూషకు వివాహం జరిగింది. అదే గ్రామానికి చెందిన బోని వెంకట దుర్గాప్రసాద్‌తో గత కొన్నేళ్లుగా ఆమెకు స్నేహం ఉండేది. పెళ్లయిన తర్వాత కూడా ఆమెను వేధిస్తూ వైజాగ్‌లోని గదికి రావాలని బలవంతం చేస్తుండేవాడు. రాకపోతే ఇంతకుముందు కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలు అందరికీ పంపిస్తానని బెదిరించేవాడు. దీంతో ఆదివారం రాత్రి అనూష తన సోదరుడికి, స్నేహితురాలికి ఈ విషయం మెసేజ్ ద్వారా తెలియజేసింది. ఇంటి సమీపంలోని పశువుల శాలలో సోమవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో ఆమె మృతదేహం లభ్యమైంది. తండ్రి తాడుతూరి రమణ ఫిర్యాదు మేరకు డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, సిఐ ఎస్.వి.ప్రభాకర్‌రావు, తహశీల్దార్ సిహెచ్‌వి రమేష్ గ్రామానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి తెగిన కాళ్లు

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తూ గొలజాపు పెంటయ్య రైలు కింద పడటంతో రెండు కాళ్లూ తెగిపోయాయి. బహిర్భూమికి వెళ్లిన పెంటయ్య ప్రమాదం బారిన పడ్డాడు. చాలా సమయం వరకూ అటుగా ఎవరూ రాకపోకపోవడంతో నానా ఇబ్బంది పడ్డాడు. అటుగా వెళ్లిన ఒక మహిళ రైలు పట్టాలపై నరకయాతన అనుభవిస్తున్న ఆయన్ను చూసి కుటుంబీకులకు సమాచారం అందించింది. వారు రైల్వే ఆర్‌పిఎఫ్ ఎస్ఐ ఆర్.హస్తకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. 108 వాహనంలో విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. సుమారు గంట వరకూ 108 సిబ్బంది స్పందించకపోవడం గమనార్హం. 108 వాహనం వచ్చే వరకు పెంటయ్య నరకయాతనతో విలవిలాడిపోయాడు. ఆయన పరిస్థితి అక్కడున్న వారిని తీవ్రంగా కలచివేసింది.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ఎస్ కోట తలారి గ్రామానికి చెందిన తాటి చెట్ల కోటి బాబు (17) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని ఎస్.కోట తలారి గ్రామానికి చెందిన తాటి చెట్ల వెంకట అప్పారావు కుమారుడు కోటి బాబు సోమవారం ఉదయం పొలంలోకి వెళ్లి పశువులను తోలుకొచ్చి ఇంటికి వచ్చాడు. అనంతరం గదిలోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. తండ్రి వెంకట అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యలను పక్కన పెడితే ఉద్యమిస్తాం

ప్రజాశక్తి - కొమరాడ

మండలాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తాం అని టిడిపి మండల కన్వీనర్ శేఖర్ పాత్రుడు మాటలను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్వాగతిస్తూనే గత ప్రభుత్వం లాగా ఈ సమస్యలు పక్కన పెడితే రాబోయే రోజులలో ఉద్యమిస్తాం అని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి మండలంలో ఏనుగులు సమస్య, అంత రాష్ట్ర రహదారి సమస్య, గిరిజన ప్రజలకు విద్య వైద్యం ఇతర మౌలిక వసతుల సమస్యలను పట్టించుకోకపోవడంతో ఓటమి చెందిందని గుర్తు చేశారు. కొత్తగా ఎమ్మెల్యే అయిన జగదీశ్వరి స్థానిక సమస్యలతో పాటు తోటపల్లి నిర్వాసితుల సమస్య, జంఝావతి రిజర్వాయర్, వనకాబడి రిజర్వాయర్, గుమ్మిడి గెడ్డ రిజర్వాయర్ సమస్యలు పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా నిర్లక్ష్యం చేస్తే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం



రోడ్డుపై పడ్డ గోతులను చూపిస్తున్న సిపిఎం నాయకులు

నాయకులు రామారావు, వెంకటేష్, శివుని నాయుడు, ఉపేంద్ర పాల్గొన్నారు.

వాహనదారుల ప్రాణాలకు భరోసా ఎవరు?

పార్వతీపురం నుంచి కోనేరు అంతర్ రాష్ట్ర రహదారిపై ప్రయాణాలు చేస్తున్న వాహనదారుల ప్రాణాలకు భరోసా ఎవరు అని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. సోమవారం మండల కేంద్రంలో అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులు వద్ద నిరసన తెలియజేసి మాట్లాడారు. మండల కేంద్రానికి అతి సమీపంలో ఈశ్వరుని దేవాలయం వద్ద పెద్దపెద్ద గోతులు అంతరాష్ట్ర రహదారిపై ఉండటంతో ఆ గోతిలోని సోమవారం ఉదయం ఏడు గంటలకు కురిసిన వర్షానికి గోతుల్లో నీరు చెరువులు మాదిరిగా తయారయ్యాయని అన్నారు. పార్వతీపురం నుండి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారి మార్గంలో ఈ గోతుల్లో నీరు భారీగా చేరడం వల్ల ఒరిస్సా రాష్ట్రానికి వెళ్లే లారీ ఆ గోతిలో దిగిపోవడంతో అటు ఇటు వెళ్లలేక అక్కడే ఉండిపోయే పరిస్థితి ఉందన్నారు. ఈ గోతులను ఈ నెల 20వ తేదీ లోపు కప్పకపోతే 21వ తేదీన ఆ గోతుల వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. తక్షణమే అధికారులు స్పందించి వాహనదారుల ప్రాణాలకు భరోసా కల్పించే విధంగా రోడ్డు మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఉపేంద్ర పాల్గొన్నారు.



వీధుల్లో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రెల్లలో సోమవారం సాయంత్రం దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి పరిసరాల్లో ఫాగింగ్ చేపట్టి మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ కాటు నుంచి రక్షణ పొందాలని ప్రజలకు సూచించారు. ప్రతి ఇంటి వద్ద ఎసిఎం పిచికారీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంటిఎస్ జి.కేశవరావు, పంచాయతీ కార్యదర్శి కిషోర్, ఆరోగ్య కార్యకర్త రాధాకష్ణ ఉన్నారు.

తిరుమలసాయిలో చదువు... నవోదయలో కొలువు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని పెదమేరంగి కూడలిలో గల తిరుమల సాయి హైస్కూల్ పేరు వినగానే ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేది జవహర్ నవోదయ సీట్లకు కొలవు అని. 20 ఏళ్లుగా ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సుమారుగా 124 మంది జవహర్ నవోదయకు ఎంపిక కాగా, కోరుకొండ సైనిక స్కూల్‌కు ఆరుగురు విద్యార్థులు ఎంపిక కావడం విశేషం. 2001లో కేవలం 60 మంది విద్యార్థులతో ఒకటి నుంచి ఏడు తరగతులకు పరిమితమైన తిరుమల సాయి విద్యానికేతన్ 2018 -2019 విద్యా సంవత్సరానికి ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ డి.రామ్మోహన్‌రావు 8,9,10 తరగతులను ప్రారంభించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు విద్యారంగంలో ఒక్కో అడుగు ముందుకు వేస్తూ అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధుల మన్నలను పొందుతూ విద్యార్థులకు విద్యతో పాటు అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నేర్పుతూ పేద,



తిరుమల సాయి హైస్కూల్ ముందుభాగం..

మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజులు భారం కాకుండా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని పాఠశాల కరస్పాండెంట్ రౌతు సరళ కుమారి తెలిపారు. విశాలమైన ఆటస్థలంతో పాటు 26 మంది బోధనా సిబ్బంది, మరో 15 మంది బోధనేతర సిబ్బంది పని చేస్తున్నారు. ఐదు బస్సులు, కంప్యూటం, లైబ్రరీ, సిబ్బంది విశ్రాంతి గదితో పాటు 30 వరకు తరగతి గదులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాలను నడుపుతున్నట్లు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను గుర్తించిన ఎడ్యుటెక్ బ్రెయిన్ ఫౌడ్ సంస్థ గతేడాది స్కూల్ ఆఫ్ ఎక్సలెంట్ అవార్డును కూడా అందజేసిందన్నారు. అంతేకాకుండా పిల్లల ప్రతిభను ప్రశంసిస్తూ ప్రజా ప్రతినిధులు సోము వీర్రాజు, గుమ్మడి సంధ్యారాణి, రాజన్నదొర, పుష్పశ్రీవాణి, నిమ్మక జయరాజుతో పాటు పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్, పార్వతీపురం జాయింట్ కలెక్టర్ గోవిందరావులతో సహా ఎంతోమంది అధికారులు, నాయకులు తిరుమల సాయి హై స్కూల్ ఆదర్శవంతమైన పాఠశాలని కొనియాడారు. ఇక్కడ విద్యతో పాటు మానవ సంబంధాలు, విలువలు, పండుగలు, సాంస్కృతి సాంప్రదాయాలు, ధార్మికమైన సుగుణాలను విద్యార్థి దశ నుండే అలవాటు చేస్తే రేపు వారి భవిష్యత్తు బాగుంటుందనే ఉద్దేశ్యంతో ఈ పాఠశాల పనిచేస్తుందని పాఠశాల న్యాయ సలహాదారు రౌతు వెంకటరమణ తెలిపారు. 2024 -25 విద్యా సంవత్సరానికి ఇంకా అడ్మిషన్లు జరుగుతాయని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



వృద్ధులకు బట్టలు పంపిణీ చేస్తున్న హెచ్‌సి

నిర్వాసిత కాలనీలో పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా, వృద్ధ మిత్ర కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణమూర్తి సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణ పరిధిలో ఉన్న నిర్వాసితుల నవిరి కాలనీలోని ఉన్న పేద మహిళలకు, వికలాంగులకు, వద్దులకు చీరలు, స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలను ఆపన్నులకు సహాయం చేయడంలోనే తనకు తృప్తి ఉంటుందని, సమాజంలో చాలామంది పేదరికంతో ఉన్నారని అలాంటి వారికి సహాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నవిరి కాలనీ పెద్దలు హెచ్.సింహాచలం, ఎర్రయ్య, హరికష్ణ, ఎం.నాగభూషన్ నాయుడు, కె.శ్రీను, ఎం.పైడిపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో పిట్టలపాడు జంక్షన్ వద్ద సీతంపేట ఎఎస్ఐ సంజీవ్ వాహనాలు తనిఖీ చేపట్టారు. త్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాల నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు మితిమీరి వేగం వెళ్లరాదని పరిమితి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించరాదని, ట్రాఫిక్ నిబంధనలు పటించాలని సూచించారు. ఓవర్ లోడ్ వేయరాదని, మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్, సిబుక్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు.



మాట్లాడుతున్న సిబ్బంది

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

వైన్ షాపుల్లో గత ఐదేళ్ల నుంచి సూపర్వైజర్లు, సేల్స్ మేనేజర్లుగా పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని వైన్ షాప్ సిబ్బంది కోరుతున్నారు. మండల కేంద్రమైన కురుపాంలో గల వైన్ షాపు వద్ద కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస వైన్ షాపుల్లో పనిచేస్తున్న సిబ్బంది సోమవారం నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 3600 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సూపర్వైజర్లు, సేల్స్‌మేన్లుగా పనిచేస్తున్నారని, వీరంతా అప్పట్లో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో డిగ్రీ చదువుకున్న యువకులు విధుల్లో చేరామని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 12,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికి ఐదేళ్లు పూర్తి అయినది గత ప్రభుత్వం మా అందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందని, కరోనా కాలంలో రాష్ట్ర ఆదాయం కోసం మా ప్రాణాలను తెగించి రాత్రింబళ్లు కష్టపడి పనిచేశామని తెలిపారు. ఇటీవల సోషల్ మీడియాలో వివిధ పత్రికల్లో మద్యం షాపులను ఎత్తివేసి, పాత పద్ధతిలో నడిపిస్తారని ప్రచారం జరుగుతుందని, ఇదే నిజమైతే కుటుంబాలతో తామంతా రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. కావున స్పందించి మద్యంపై ఎటువంటి నిర్ణయం తీసుకున్నా తమకు అభ్యంతరం లేదని, అయితే రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న సూపర్వైజర్లు, సేల్స్ మేన్లను ఇతర ప్రభుత్వం విభాగాల్లో ఔట్ సోర్సింగ్ కింద ఉద్యోగం కల్పించి, మా కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో సిబ్బంది జి.శంకర్రావు, గ్రంధి శ్రీను, ఎ.చంద్రశేఖర్, ఉదయ్ , బాలు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

తప్పుడు ఆరోపణలు చేయడం తగదు : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి సిఎంఒ కార్యాలయం నుంచి ప్రభుత్వ ఫర్నిచర్‌ను దొంగిలించారంటూ కొంతమంది టిడిపి నాయకులు ఆరోపించడం అవాస్తవమని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర చెప్పారు. సోమవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫర్నిచర్‌ను దొంగిలించాల్సిన అవసరం జగన్‌కు లేదన్నారు. తన క్యాంపు కార్యాలయంలో ఉన్న ఫర్నీచర్‌ను ప్రభుత్వం అడిగితే ఇచ్చేస్తారని, దాని ఖరీదు ఎంతో చెబితే చెల్లిస్తారని చెప్పారు. ఈ మాత్రం దానికి జగన్‌పై అబద్దాల ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు. విశాఖ రుషికొండలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధునిక సదుపాయాలతో అతిథి గృహాన్ని నిర్మించారని, మళ్లీ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని నమ్మకంతో నిర్మించారని చెప్పారు. విశాఖను రాజధాని చేయాలనే ఆలోచనలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు వచ్చినప్పుడు ఆతిథ్యం ఇవ్వడానికి వీలుగా రుషికొండ అతిథి గృహాన్ని నిర్మించారని చెప్పారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం దాన్ని వారి అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవచ్చునని చెప్పారు. అంతేకానీ మాజీ సిఎం జగన్‌పై బురద చల్లడం సముచితం కాదని రాజన్నదొర అన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

2047 నాటికి సికిల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్‌లో భాగంగా సోమవారం మండలంలోని పెదబొండపల్లి పిహెచ్‌సి పరిధిలోని, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సికిల్ ఎనీమియా వారసత్వంగా వచ్చే ఎర్ర రక్త కణాలు కారణమని ఇది తల్లిదండ్రుల నుండి అనువంశికంగా సంక్రమిస్తుందని అన్నారు. రక్త కణాల



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

సంఖ్య తగ్గడం వల్ల కళ్ళు పసుపు రంగులో మారడం గర్భధారణ సమయంలో సమస్యలు కీళ్ల నొప్పులు వంటివి ఎదురవుతాయని, ఈ వ్యాధిని గుర్తించేందుకు 40 సంవత్సరాల లోపు వారికి సమీప ఆరోగ్య కేంద్రంలో ఉచితంగానే పరీక్షలు చేసుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ అనూష, డాక్టర్ ధరణి, ఎంపిహెచ్ఇఒ వెంకటనాయుడు, పిహెచ్‌ఎం పార్వతి, హెచ్‌ఎస్ శంకర్రావు, జయలక్ష్మి, ఆశాలు సిహెచ్‌డబ్ల్యుఒలు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రముఖుల పుట్టినరోజు వేడుకలు అనాధాశ్రమాల్లో నిర్వహించడం సాంప్రదాయమని పట్టణంలోని కనపాకకు చెందిన అన్నదాత సుఖీభవ అనాధాశ్రమం నిర్వాహకులు కాంచన పేర్కొన్నారు. రాజమండ్రి దగ్గర వేమగిరికి చెందిన కొప్పు శెట్టి నాగేశ్వరరావు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి శుభాష్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని సోమవారం నగరంలోని రెడ్ క్రాస్ నిరాశ్రయుల షెల్టర్, కణపాక మర్రి చెన్నారెడ్డి కాలనీలోని అన్నదాత సుఖీభవ ఆశ్రమం లో అన్నదానం నిర్వహించారు. ఆశ్రమంలోని పిల్లల మధ్య కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు.